PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక 221 | పేజీలు : 8 | వెల రూ.5 | శుక్రవారం 04.09.2026
ఎడిటర్ : చెరుకు ఉపేందర్
Published From Rangareddy
Circulated to All Districts of Telangana and Andhra Pradesh




WANTED REPORTERS

# కొండా సురేఖపై వేటు

## గవర్నర్ ఆమోదం..కాంగ్రెస్‌లో ముగిసిన ఉత్కంఠ

- కూతురు వ్యాఖ్యలే కారణం
- అధిష్ఠానం అనుమతితో సీఎం రేవంత్ నిర్ణయం
- 'నన్ను సంప్రదించలేదు..అన్యాయంగా తొలగించారు' : సురేఖ
- 'నా తల్లికి అన్యాయం జరిగింది..ఆమెను మౌనం చేయలేరు' : సుష్మిత

తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠకు తెరపడింది. మంత్రి కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయానికి గవర్నర్ శివప్రతాప్ శుక్లా గురువారం ఆమోదం తెలిపారు. దీంతో సురేఖను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగించినట్లు లోక్‌భవన్ ప్రకటించింది.



హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు:
తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠకు తెరపడింది. మంత్రి కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయానికి గవర్నర్ శివప్రతాప్ శుక్లా గురువారం ఆమోదం తెలిపారు. దీంతో సురేఖను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగించినట్లు లోక్‌భవన్ ప్రకటించింది.

**కూతురి వ్యాఖ్యలతో మొదలైన వివాదం**

ఆగస్టు 19న కొండా సురేఖ కుమార్తె కొండా సుష్మిత వరంగల్ జిల్లా గీసుకొండలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పరకాల నియోజకవర్గంలో రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మళ్లీ గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సుష్మిత అభ్యంతరం వ్యక్తం చేశారు. తాను పరకాల నుంచి రాజకీయంగా పోటీ చేయాలనే ఆసక్తిని కూడా వ్యక్తం చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. దీంతో కాంగ్రెస్‌లో వివాదం ముదిరింది. సుష్మిత వ్యాఖ్యలపై టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ తీవ్రంగా స్పందించి కొండా సురేఖకు నోటీసులు జారీ చేసింది. సురేఖ తన వివరణలో కూతురు చేసిన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగత అభిప్రాయాలని, తాను వాటికి బాధ్యత వహించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

**క్రమశిక్షణా కమిటీ సిఫారసు**

సురేఖ వివరణతో పాటు మీడియా కథనాలు, వీడియోలు, సంబంధిత పరిణామాలను పరిశీలించిన అనంతరం టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ సురేఖ, చిన్నారెడ్డి వ్యవహారాల్లో కఠిన చర్యలు తీసుకోవాలని పార్టీ అధిష్ఠానానికి నివేదిక ఇచ్చింది. సురేఖపై కేబినెట్ నుంచి తొలగింపు చర్య తీసుకోవాలని సిఫారసు చేసింది.

**అధిష్ఠానం చర్చల తర్వాత నిర్ణయం**

ఈ వ్యవహారంపై సురేఖ ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌లను కలసి తన వాదన వినిపించారు. ఖర్గే తన వాదనను విన్నారని సురేఖ తెలిపారు. అనంతరం కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి అనుమతి తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి ఆమెను మంత్రివర్గం నుంచి తొలగించాలని నిర్ణయించారు.

**గవర్నర్ ఆమోదంతో అధికారికంగా వేటు**

గురువారం సీఎం రేవంత్‌రెడ్డి సురేఖను మంత్రివర్గం నుంచి తొలగిస్తూ గవర్నర్‌కు సిఫారసు పంపారు. సాయంత్రానికి గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఆ సిఫారసుకు ఆమోదం తెలిపారు. ముఖ్యమంత్రి సలహా మేరకు సురేఖను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగించినట్లు లోక్‌భవన్ ప్రకటించింది.

**'నన్ను సంప్రదించలేదు' : సురేఖ**

తన తొలగింపుపై కొండా సురేఖ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని, అవినీతి ఆరోపణలు తనపై లేవని, క్రమశిక్షణా కమిటీ నోటీసుకు సమాధానం ఇచ్చానని తెలిపారు. తనను తొలగించే ముందు ఎవరూ సంప్రదించలేదని, తన వాదన పూర్తిగా వినలేదని అన్నారు. కూతురు సుష్మిత చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదని స్పష్టం చేశారు.

**'ఇది కక్ష సాధింపు' అని ఆరోపణ**

సురేఖ తనపై తీసుకున్న చర్యను అన్యాయంగా అభివర్ణించారు. తనను రాజకీయంగా, పరిపాలనాపరంగా పక్కన పెట్టారని ఆరోపించారు. తనను తొలగించే నిర్ణయం వెనుక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒత్తిడి ఉందని, అధిష్ఠానంపై ఒత్తిడి తెచ్చారని ఆరోపించినట్లు తాజా కథనాలు పేర్కొన్నాయి. అయితే ఇవి సురేఖ చేసిన ఆరోపణలేనని, వాటిపై స్వతంత్ర నిర్ధారణ లేదని గమనించాలి.

**తల్లికి అన్యాయం : సుష్మిత**

తన తల్లి సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించడంపై కొండా సుష్మిత తీవ్రంగా స్పందించారు. తన వ్యాఖ్యలు వ్యక్తిగతమైనవేనని, పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడలేదని పేర్కొన్నారు. తన తల్లికి అన్యాయం జరిగిందని, ఆమెను మౌనం చేయలేరని అన్నారు. రేవంత్‌రెడ్డిపై తన విమర్శలను కొనసాగిస్తూ ఆయనకు రాజకీయంగా సవాల్ కూడా విసిరారు.

**లక్ష్మణరేఖ దాటితే ఎంతటివారైనా చర్యలు తప్పవు : మల్లు రవి**

టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి మాత్రం సురేఖపై చర్యను సమర్థించారు. పార్టీ క్రమశిక్షణకు ఎవరూ అతీతులు కారని, సురేఖ వ్యవహారంలో ఇరువైపుల వాదనలు విన్న తర్వాతే అధిష్ఠానం నిర్ణయం తీసుకుందని తెలిపారు. సురేఖ వ్యాఖ్యలు పార్టీకి, ప్రభుత్వానికి నష్టం కలిగిస్తున్నందునే చర్య తీసుకున్నట్లు చెప్పారు.

**చిన్నారెడ్డిపైనా చర్య.. కొత్త నియామకాలు**

ఇదే సమయంలో తెలంగాణ ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్‌గా ఉన్న జి. చిన్నారెడ్డి నియామకాన్ని కూడా ప్రభుత్వం రద్దు చేసింది. ఆయన స్థానంలో గద్వాల విజయలక్ష్మిని నియమించారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్‌గా మాజీ రాజ్యసభ సభ్యురాలు జి. సుధారాణిని నియమించారు.

**సురేఖ రాజకీయ భవిష్యత్తుపై ఉత్కంఠ**

మంత్రివర్గం నుంచి తొలగింపుపై సురేఖ తదుపరి రాజకీయ కార్యాచరణపై ఇంకా స్పష్టత ఇవ్వలేదు. తన రాజకీయ భవిష్యత్తుపై త్వరలో నిర్ణయం తీసుకుంటానని ఆమె తెలిపారు. దీంతో కాంగ్రెస్‌లో సురేఖ తదుపరి అడుగులు, పరకాల రాజకీయాలపై ఆసక్తి నెలకొంది.

## కొండా సురేఖ తొలగింపు కాంగ్రెస్ అంతర్గత అంశం

### రేవంత్‌రెడ్డి పరిపాలనపై నియంత్రణ కోల్పోయారు: ఈటల రాజేందర్



సికింద్రాబాద్ – ప్రభాత సూర్యుడు:
మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించిన అంశంపై మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించడం కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారమని అన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డి పరిపాలనపై నియంత్రణ కోల్పోయారని ఈటల విమర్శించారు. “దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కదిద్దుకోవాలి” అన్న విధంగా కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు. అక్రమాలు, భూకబ్జాలు, అవినీతి, దౌర్జన్యాలకు కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంగా మారిందని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ఆకాశం నుంచి భూమిపైకి దిగి వాస్తవ పరిస్థితులను ఆలోచిస్తే మంచిదని అన్నారు. అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి రేవంత్‌రెడ్డి ఇబ్బందుల్లో పడ్డారని ఈటల పేర్కొన్నారు. కొండా దంపతుల రాజకీయ భవిష్యత్తుపై వారు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సి ఉందన్నారు.

## ఓల్డ్ సిటీ అభివృద్ధికి

# శాయశక్తులా కృషి

### రూ.620 కోట్లతో నిర్మించిన చంచల్‌గూడ––సంతోష్‌నగర్ స్టీల్ ఫ్లైఓవర్ ప్రారంభం



హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు:
చారిత్రక హైదరాబాద్ ఒరిజినల్ సిటీ (ఓల్డ్ సిటీ) అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా శాయశక్తులా కృషి చేస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. దేశంలోనే అభివృద్ధి చెందిన అతిపెద్ద నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. చంచల్‌గూడ––సంతోష్‌నగర్ మధ్య రూ.620 కోట్ల వ్యయంతో 3.2 కిలోమీటర్ల పొడవున నిర్మించిన స్టీల్ ఫ్లైఓవర్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం ప్రజాప్రతినిధులతో కలిసి ఓపెన్ టాప్ వాహనంలో ప్రయాణిస్తూ ఫ్లైఓవర్‌ను పరిశీలించారు. చంచల్‌గూడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి రూ.25 కోట్లు మంజూరు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. నెల రోజుల్లో జీవో జారీ చేసి, ఏడాదిన్నరలో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలాను ఆదేశించారు. ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ప్రస్తావించిన అభివృద్ధి పనులన్నింటినీ మంజూరు చేస్తామని తెలిపారు. మీరాలం ట్యాంకును రూ.500 కోట్లతో అద్భుతమైన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని, ఆరాంఘర్, శాస్త్రిపురం ఫ్లైఓవర్ల పనులు పూర్తయ్యాయని చెప్పారు. భూసేకరణ ప్రక్రియ పూర్తికావస్తున్న నేపథ్యంలో వచ్చే డిసెంబర్‌లో గౌలిగూడ నుంచి చాంద్రాయణగుట్ట వరకు మెట్రో విస్తరణ పనులు ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజారుద్దీన్, ఎంపీలు అనిల్‌కుమార్ యాదవ్, వేం నరేందర్‌రెడ్డి, అసదుద్దీన్ ఓవైసీ, కె. రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# లక్కీ ఛాన్స్ అంటే కేకే కుటుంబానిదే!

### వరుసగా కీలక పదవులు..

## తెలంగాణ వచ్చిన నాటి నుంచి కొనసాగుతున్న పదవుల పరంపర

హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు:
పదవుల విషయంలో కేకే కుటుంబానికి వరుసగా అవకాశాలు దక్కుతున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. పార్టీ మారినప్పటికీ పదవులు మాత్రం కొనసాగుతుండటం ఆసక్తికరంగా మారింది. బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్ మేయర్‌గా ఎన్నికైన కేశవరావు కుమార్తె విజయలక్ష్మి.. మేయర్‌గా పదవీకాలం పూర్తయ్యే వరకు కొనసాగారు. అనంతరం మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా అవకాశం దక్కగా, కొద్దిరోజులకే ప్రణాళికా సంఘం ఉ



పాధ్యక్షురాలిగా నియమితులయ్యారు. మరోవైపు కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి వెళ్లిన కేశవరావుకు బీఆర్ఎస్‌లో ప్రధాన కార్యదర్శి, అనంతరం రాజ్యసభ సభ్యుడిగా అవకాశాలు లభించాయి. ప్రభుత్వం మారిన తర్వాత తిరిగి కాంగ్రెస్‌లో చేరడంతో ప్రభుత్వ సలహాదారుగా క్యాబినెట్ హోదా దక్కింది. మొత్తంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి కేకే కుటుంబంలో ఎవరో ఒకరికి కీలక పదవి దక్కుతూనే ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పదవులు మారుతున్నా.. అవకాశాల పరంపర మాత్రం కొనసాగుతోందనే చర్చ రాజకీయ వర్గాల్లో నెలకొంది.

## గవర్నర్‌ను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు:
రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి శుక్రవారం లోక్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రులు పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజారుద్దీన్‌తో పాటు పలువురు ఎంపీలు ముఖ్యమంత్రితో ఉన్నారు. ఇదే సమయంలో కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించే అంశానికి సంబంధించిన ఫైల్‌ను గవర్నర్‌కు అందించే అవకాశం ఉందన్న చర్చ రాజకీయ వర్గాల్లో నెలకొంది. ఇప్పటికే ముఖ్యమంత్రి కార్యదర్శి శేషాద్రి సీల్డ్ కవర్‌తో లోక్‌భవన్‌కు చేరుకోవడం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# ముగ్గురు కొత్త మంత్రులు వీరేనా?

## ఈ నెల 6న తెలంగాణ కేబినెట్ విస్తరణకు అవకాశం

హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు: కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించడంత, మూడు మంత్రి పదవులు ఖాళీగా ఉన్న నేపథ్యంలో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ నెల 6న కేబినెట్ విస్తరణ జరిగే అవకాశం ఉందనే ప్రచారం రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ ప్రాతినిధ్యాన్ని పరిగణనలోకి తీసుకుని కొత్త మంత్రుల ఎంపికపై కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో గడ్డం ప్రసాద్‌కుమార్, రాంచంద్రు నాయక్, బాలు నాయక్ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. కేబినెట్ బెర్త్ కోసం ఆశలు పెట్టుకున్న వారిలో గడ్డం ప్రసాద్‌కుమార్ (ఎస్సీ), రాంచంద్రు నాయక్ (ఎస్టీ), రాజగోపాల్‌రెడ్డి (ఓసీ), మల్‌రెడ్డి రంగారెడ్డి (ఓసీ), విజయశాంతి (బీసీ), ఆది శ్రీనివాస్ (బీసీ), బస్వరాజ్ సారయ్య (బీసీ), బీర్ల అయిలయ్య (బీసీ) ఉన్నారు. మూడు ఖాళీ స్థానాలకు ఎవరిని ఎంపిక చేస్తారన్నది ఇప్పుడు కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ప్రచారంలో ఉన్న పేర్లలో చివరకు ఎవరికి అవకాశం దక్కుతుందో ఈ నెల 6న స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# బెల్ట్ షాపుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

## మజీద్‌పూర్‌లో గ్రామపంచాయతీ, గ్రామసభ తీర్మానం




అబ్దుల్లాపూర్‌మెట్ – ప్రభాత సూర్యుడు:
రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని మజీద్‌పూర్ గ్రామంలో అక్రమ మద్యం విక్రయాలు (బెల్ట్ షాపులు) నియంత్రించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామపంచాయతీ పాలకవర్గం, గ్రామసభ తీర్మానం చేశాయి. ఈ మేరకు తీర్మాన ప్రతిని అబ్దుల్లాపూర్‌మెట్ ఎస్సై సైదులుకు అందజేశారు. గ్రామంలో బెల్ట్ షాపుల కారణంగా మహిళలు, యువత ఇబ్బందులకు గురవుతున్నారని, కుటుంబాల్లో సమస్యలు ఏర్పడుతున్నాయని తీర్మానంలో పేర్కొన్నారు. అక్రమంగా మద్యం విక్రయించే కేంద్రాలపై నిఘా ఉంచి, వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని ఎస్సై సైదులును కోరారు. ఈ సందర్భంగా మజీద్‌పూర్ సర్పంచి మేడిపల్లి ప్రియా చంద్రశేఖర్ మాట్లాడుతూ, గ్రామంలో శాంతిభద్రతలు, ప్రజల ఆరోగ్యం, కుటుంబ సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అక్రమ మద్యం విక్రయాలను నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ ప్రజల సహకారంతో మజీద్‌పూర్‌ను ప్రశాంతమైన, ఆరోగ్యకరమైన గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# పల్లవి ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు






అబ్దుల్లాపూర్ మెట్ – ప్రభాత సూర్యుడు:
పల్లవి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను విద్యార్థులు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొన్న విద్యార్థులు నృత్యాలు, భక్తిగీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. చివరగా నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. కళాశాల మేనేజ్‌మెంట్ ప్రతినిధి బెరెల్లి కమలాకర్ రావు మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేడుకలను నిర్వహించిన విద్యార్థులను అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఐక్యత, నాయకత్వ లక్షణాలు, సాంస్కృతిక విలువలను పెంపొందిస్తాయని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.బి.వి. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, విద్యార్థులు భగవద్గీతలోని విలువలను ఆదర్శంగా తీసుకుని క్రమశిక్షణ, నైతికత, ఆత్మవిశ్వాసంతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. ప్రశాంత్ కుమార్ భగవద్గీతలోని కర్తవ్యనిష్ఠ, మనోనిగ్రహం, సమత్వ భావన వంటి విలువలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ధనుంజయ రావు కొడాలి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎ. సంతోష్, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కేసీఆర్ రైతుబంధు అయితే..
# రేవంత్ రాబందు !

- మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి,
- రాష్ట్ర నాయకులు ప్రశాంత్ కుమార్ రెడ్డి



అబ్దుల్లాపూర్ మెట్ – ప్రభాత సూర్యుడు:
420 హామీలను 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, వెయ్యి రోజులు గడిచినా హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ బీఆర్ఎస్ చేపట్టిన పోరుబాటలో భాగంగా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని యాచారం మండల కేంద్రంలో రైతు సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి) పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలోని రైతులు రైతుబంధు, రైతుబీమా, యూరియా, బోనస్ తదితర అంశాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ కంటతడి పెడుతున్నారని ఆరోపించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని రైతులను 22ఏ సమస్యతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. యాచారంలో ఫార్మాసిటీని రద్దు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అనంతరం మాట మార్చి రైతులను మోసం చేసిందని వారు ఆరోపించారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

# గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

– గణేష్ మండపాల నిర్వాహకులతో సమన్వయ సమావేశం

– ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి



ఘట్‌కేసర్ – ప్రభాత సూర్యుడు:
గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, నిబంధనల మేరకే నిర్వహించాలని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి గణేష్ ఉత్సవ మండపాల నిర్వాహకులకు సూచించారు. గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాల నిర్వహణపై ఘట్‌కేసర్ పోలీసుల ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకులతో గురువారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ బాలస్వామి మాట్లాడుతూ, మండపాల నిర్వాహకులు సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు పొందాలని, సీసీ కెమెరాలు, అగ్నిమాపక భద్రత, విద్యుత్, వెలుతురు, జన నియంత్రణకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఊరేగింపు సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులకు సహకరించాలని, డీజేలు, లౌడ్‌స్పీకర్ల వినియోగంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొని ఉత్సవాల సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లు, బాధ్యతలపై నిర్వాహకులకు సూచనలు చేశారు.

# అధికారుల కళ్లముందే బెల్టు షాపుల దందా?

- గ్రామసభల తీర్మానాలతోనైనా మేల్కొంటారా..!
- అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో అక్రమ మద్యం విక్రయాలపై పెరుగుతున్న ఆరోపణలు

గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయాలను అరికట్టాల్సిన అధికార యంత్రాంగం ఏం చేస్తోంది? బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలని గ్రామసభలే తీర్మానాలు చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? అధికారుల నిఘా, పర్యవేక్షణ ఉన్నప్పటికీ బెల్టు షాపులు ఎలా విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి? అనే ప్రశ్నలు అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలో ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారుతున్నాయి.




ఏఐ ఇమేజ్

రంగారెడ్డి – ప్రభాత సూర్యుడు:
మండల పరిధిలోని మజీద్‌పూర్ గ్రామంలో బెల్టు షాపులను నియంత్రించాలంటూ గ్రామపంచాయతీ పాలకవర్గంతో పాటు గ్రామసభ తీర్మానం చేయడం ఈ వ్యవహారంపై మరోసారి దృష్టిని మళ్లించింది. అక్రమ మద్యం విక్రయ కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తీర్మాన ప్రతిని గురువారం అబ్దుల్లాపూర్ ఎస్సై సైదులుకు గ్రామపంచాయతీ ప్రతినిధులు అందజేశారు.

**గ్రామసభ తీర్మానం.. అధికారులకు చెంపపెట్టు లాంటి ప్రశ్న**

మజీద్‌పూర్‌లో బెల్టు షాపుల కారణంగా మహిళలు, యువత ఇబ్బందులకు గురవుతున్నారని, మద్యం కారణంగా కుటుంబాల్లో సమస్యలు తలెత్తుతున్నాయని గ్రామసభలో ఆందోళన వ్యక్తమైంది. అక్రమంగా మద్యం విక్రయించే కేంద్రాలపై నిఘా పెట్టి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ తీర్మానం చేశారు. సాధారణంగా గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయాలను గుర్తించి అడ్డుకోవాల్సిన బాధ్యత ఎక్సైజ్, పోలీసు శాఖలపై ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో గ్రామసభలే బెల్టు షాపులను అరికట్టాలంటూ తీర్మానాలు చేసే స్థాయికి సమస్య చేరుకోవడం అధికారుల పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

**అధికారుల కన్నుసన్నల్లోనే దందా సాగుతోందా?**

స్థానికంగా వినిపిస్తున్న ఆరోపణలు మరింత తీవ్రంగా ఉన్నాయి. బెల్టు షాపులు ఎక్సైజ్ అధికారుల కన్నుసన్నల్లోనే విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని, కాసులకు కక్కుర్తి పడి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అక్రమంగా మద్యం విక్రయించే ప్రాంతాలు అధికారులకు తెలియకుండా కొనసాగడం సాధ్యమేనా? నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు వస్తున్నప్పటికీ చర్యలు ఎందుకు కనిపించడం లేదనే ప్రశ్నలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

**ఎక్సైజ్ శాఖ నిఘా ఏమైంది?**

బెల్టు షాపుల నిర్వహణపై ఎక్సైజ్ శాఖ నిరంతర నిఘా పెట్టాల్సి ఉన్నప్పటికీ.. గ్రామసభల్లోనే ఈ అంశంపై తీర్మానాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడటంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అక్రమ మద్యం విక్రయాలు బహిరంగంగానే జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నప్పుడు.. సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారు? అన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. బెల్టు షాపులపై ఉక్కుపాదం మోపుతున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని స్థానికుల ఆరోపణలు చెబుతున్నాయి. గ్రామసభ తీర్మానాలను కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా సంబంధిత శాఖలు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవ పరిస్థితిని బయటపెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**ఇకనైనా ఉన్నతాధికారులు స్పందిస్తారా?**

మజీద్‌పూర్ గ్రామసభ తీర్మానం నేపథ్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని బెల్టు షాపులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలనే డిమాండ్ ఊపందుకుంది. కేవలం ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే కాకుండా.. బెల్టు షాపులపై నిరంతర నిఘా ఏర్పాటు చేసి అక్రమ మద్యం విక్రయాలను పూర్తిగా అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామసభలే తీర్మానాలు చేసి అధికారులను చర్యలకు కోరుతున్న పరిస్థితికి కారణాలేమిటో ఉన్నతాధికారులు సమీక్షించాల్సిన అవసరం ఉంది. బెల్టు షాపుల వెనుక ఎవరున్నారు? వాటికి అండగా ఎవరైనా ఉన్నారా? అధికారుల నిర్లక్ష్యం ఉందా? ఆర్థిక ప్రయోజనాల ఆరోపణల్లో నిజమెంత? అన్న అంశాలపై సమగ్ర విచారణ జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ప్రజల ఆరోగ్యం, మహిళల భద్రత, కుటుంబ సంక్షేమం వంటి అంశాలతో ముడిపడి ఉన్న ఈ సమస్యపై సంబంధిత అధికారులు ఇకనైనా కఠిన చర్యలు తీసుకుంటారా? లేక గ్రామసభల తీర్మానాలు కూడా బెల్టు షాపుల ముందు బలహీనంగానే మిగిలిపోతాయా? అనేది వేచి చూడాల్సిందే.

# బడంగ్‌పేట్ సర్కిల్‌లో ఎస్ఐఆర్ ప్రత్యేక ప్రచారం

## ప్రతి ఓటరు జాబితాలో పేర్లు పరిశీలించాలి: ఏఈఆర్ఓ వి. సమ్మయ్య

బడంగ్‌పేట్ – ప్రభాత సూర్యుడు:
ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో భాగంగా సెప్టెంబర్ 5, 6 తేదీల్లో బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఏఈఆర్ఓ వి. సమ్మయ్య తెలిపారు. రెండో దశలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లోనూ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. అర్హత కలిగిన ఓటర్లు డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. పేరు నమోదు, తొలగింపు, మార్పులు, చేర్పుల కోసం ఫారం-6, ఫారం-7, ఫారం-8 ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. ప్రత్యేక ప్రచార రోజుల్లో పోలింగ్ కేంద్రాల్లో బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లు, సంబంధిత బీఎల్ఓ ఏజెంట్లు అందుబాటులో ఉంటారని చెప్పారు. ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఈఆర్ఓ వి. సమ్మయ్య కోరారు.

# ఇనాంగూడ వద్ద రోడ్డు ప్రమాదం

– ఆగి ఉన్న డీసీఎంను ఢీకొన్న ఆర్టీసీ బస్సు – పలువురు ప్రయాణికులకు తీవ్ర గాయాలు

అబ్దుల్లాపూర్‌మెట్ – ప్రభాత సూర్యుడు:
అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఇనాంగూడ వద్ద గురువారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సు రోడ్డుపై ఆగి ఉన్న డీసీఎంను ఢీకొట్టింది. డీసీఎంలో ఇనుము లోడు ఉండటంతో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉందని, ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం 48 మంది ప్రయాణికులు ఉండగా, వారిలో కనీసం 10 మందికి గాయాలైనట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి



# సంపాదకీయం

## ట్రంపరితనంను ఎదురించాల్సిందే !

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హద్దుమీరి ప్రవర్తిస్తున్న తీరు మరోమారు ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఏ దేశం ఎవరితో దోస్తానా చేయాలో..ఎవరితో వాణిజ్యం చేయాలో అన్న ఆంక్షలు విధించే హక్కు ట్రంప్‌కు ఎక్కడిదని ప్రశ్నించాలి. ఈ విషయంలో మోడీ దేశ సార్వభౌమాధికారాన్ని నిలబెట్టాలి. ట్రంప్ ఆంక్షలను అంగీకరించేది లేదని గట్టిగానే చెప్పాలి. చర్చలు జరిపేది లేదంటున్న ట్రంప్‌తో మనం కూడా అంతే మొండి వైఖరితో ఉండాలి. 140 కోట్ల జనాభా ఉన్న భారత్‌తో పెట్టుకుంటే ఏమవుతుందో చెప్పగలగాలి. ఒకవైపు మనపై వాణిజ్య ఆంక్షలు విధిస్తూ..మరోవైపు పాక్‌ను దువ్వుతున్న తీరు అమెరికా ద్వంద్వ నీతిని తెలియ చేస్తోంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై అమెరికా విధించిన అదనపు సుంకాలు తీవ్ర దుమారం రేపుతున్న వేళ ట్రంప్ ఏ మాత్రం తగ్గేది లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంలో రెండు దేశాల మధ్య ఓ రకంగా విభేదాలు పొడసూపి నట్లుగానే భావించాలి. ట్రంప్ ఏకపక్ష నిర్ణయాలు భారత్‌కు పరీక్షగా మారాయి. ఈక్రమంలో మోడీ కూడా మనదేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుకుంటూనే ముందుకు సాగాలి. ప్రపంచంలోనే అత్యధిక సుంకాలను తమపై విధించడంతో భారత్ దీటుగా స్పందించింది. తమ దేశంలోని రైతులు, మత్స్యకారులు, పాల ఉత్పత్తుల రంగంలోని వారి ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేసింది. అవసరమైతే ఆ భారాన్ని తామే భరిస్తామని వెల్లడించింది. మరోవైపు భారత్‌పై మరిన్ని ఆంక్షలను విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇక ఆయన విధించిన సుంకాలు గురువారం నుంచి అమల్లోకి వచ్చాయి. దీనివల్ల అమెరికాలో కొన్నింటి ధరలు పెరగనున్నాయి. అయితే, అమెరికా అదనపు సుంకాల వల్ల రెండు దేశాల మధ్య తలెత్తిన వివాదం తాత్కాలికమేనని, త్వరలోనే సమసిపోతుందని ప్రవాస భారతీయ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. చర్చలు ఫలించి త్వరలో ఒప్పందం కుదరనుందనే ఆశాభావం వ్యక్తం చేశాయి. 50 లక్షల మంది ప్రవాస భారతీయులు అమెరికా అభివృద్ధిలో భాగస్వాములుగా ఉన్నారని పేర్కొన్నారు. భారతీయ ఉత్పత్తులపై 50శాతం సుంకాలను వేయడాన్ని ఇండియన్-అమెరికన్ల నేత, బైడెన్ మాజీ సలహాదారు అజయ్ భుటోరియా ఖండించారు. 'అమెరికాలో తక్కువ ధరలకు లభించే 50శాతం జనరిక్ మందులను భారత్ సరఫరా చేస్తోంది. ఈ సుంకాలు వాటి ధరలను పెంచుతాయి. దీనివల్ల అమెరికాలోని కుటుంబాలు, సీనియర్ సిటిజన్లు, చిన్న వ్యాపారులు ఇబ్బందులు పడతారు. మసాలా దినుసులు, పప్పులు, దీపావళి దుస్తుల ధరలు పెరుగుతాయని పేర్కొన్నారు. దుస్తులు, పాదరక్షల ధరలు 37శాతం దాకా పెరగవచ్చని అభిప్రాయపడ్డారు. ఇది ఎలా ఉన్నా మనం కూడా తగ్గేదేలా లేదన్నట్లుగా వ్యవహ రించాలి. కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ ఇదే విషయాన్ని గుర్తుచేశారు.. ట్రంప్ విధించిన అదనపు సుంకాలపై ప్రధాని మోదీ గట్టిగా సమాధానమిచ్చారు. తమ రైతుల ప్రయోజనాల విషయంలో ఎప్పటికీ రాజీ పడబోమని, దానికి ఎంత మూల్యమైనా చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలే మాకు అత్యంత ముఖ్యం. రైతులు, మత్స్యకారులు, డెయిరీ ఉత్పత్తిదారుల ప్రయోజనాల విషయంలో భారత్ ఎప్పటికీ రాజీ పడబోదు. వారిని కాపాడటం కోసం సుంకాల భారాన్ని సొంతగా భరించడానికీ సిద్ధం అని ప్రధాని స్పష్టం చేశారు. రష్యా నుంచి చమురు కొంటుందన్న కారణంతో భారత్‌పై 50శాతం సుంకాలను విధించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మరో బాంబు పేల్చారు. తదుపరి మరిన్ని ఆంక్షలను చూస్తారంటూ హెచ్చరించారు. శ్వేత సౌధంలోని ఓవల్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'భారత్‌పై మేం 50శాతం సుంకాలను విధించిన విషయం మీకు తెలుసు. ఆ దేశం రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకునే దేశాల్లో రెండో స్థానంలో ఉంది. తొలిస్థానంలో ఉన్న చైనాకు అతి దగ్గరగా ఉంది. అందుకే భవిష్యత్తులో మరిన్ని ఆంక్షలను చూడబోతున్నారని పేర్కొన్నారు. ట్రంప్ తీరు చూస్తుంటే పిచ్చోడి చేతిలో రాయిలా ఉంది. తన వైఖరిని నెగ్గించుకోవడమే ఆయనకు ముఖ్యంగా ఉంది. ఎలన్ మస్క్ లాంటి వారినే దూరం పెట్టిన ట్రంప్‌కు భారత్ ప్రయోజనాలు ముఖ్యం కాదు. ఇకపోతే ఆపరేషన్ సింధూర్ తరవాత భారత్ సైనికంగా బలపడడంతో కూడా ట్రంప్ తట్టుకోవడం లేదని తెలుస్తోంది. ఇది కూడా ట్రంప్ వైఖరికి కారణం కావచ్చని వశ్లేషిస్తున్నారు. భారత్‌పై గతంలో విధించిన 25శాతం సుంకాలు గురువారం నుంచి అమల్లోకి వచ్చాయి. అదనంగా విధించిన మరో 25శాతం ఈ నెల 27వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయి. మన దేశంతోపాటు అనేక దేశాలపై సుంకాలు గురువారం నుంచే అమల్లోకి వచ్చాయి. దీనివల్ల బిలియన్ల కొద్దీ డాలర్లు అమెరికాకు వస్తాయని ట్రంప్ ప్రకటించారు. ఈ సుంకాలు 10శాతం నుంచి 50శాతం దాకా ఉన్నాయి. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత గత పదకొండేళ్లుగా ఇలా ఎప్పుడూ జరగలేదు. అవినీతిరహితంగా పాలన సాగుతుందన్న పేరు వచ్చింది. అలాగే సాహసోపేత నిర్ణయాలు కూడా తీసుకుని సత్తా చాటింది. అయోధ్య, కాశ్మీర్, ట్రిపుల్ తలాక్ విషాయల్లో సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారు. ఇటీవల ఆపరేషన్ సిందూర్ ద్వారా మన సైనిక సత్తా చాటాం. పాక్‌కు గట్టిగా బుద్ది చెప్పాం. ప్రపంచవ్యాప్తంగా భారత్చర్యలకు గట్టి మద్దతు లభించింది. మోడీ సర్కార్ సాహస నిర్ణయాలకు వెనకాడదని రుజువు చేసుకుంది. సర్జికల్ స్ట్రయిక్స్ తరవాత, ఆపరేషన్ సిందూర్తరవాత కూడా పాక్ వైఖరిలో మార్పు రాలేదు. దాయాది దేశాన్ని ప్రపంచంలో దోషిగా నిలబెట్టిన ఘనత మోడీదే అని చెప్పక తప్పదు. ట్రంప్ విషయంలో ఏ నిర్ణయం తీసుకుంటారో అని దేశం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. ఈ క్రమంలో భారత్ తన సార్వభౌమాధికరం ముఖ్యమని చాటి చెప్పాలి.

## మా భూములకు రక్ష కెటిఆర్ అన్న



మొదటి పేజీ తరువాయి

అధికారులు, పోలీసులు దౌర్జన్యం చేశారని, ఆమె భర్తను జైలుకు పంపిన, సమయంలో కేటీ-ఆర్ ఢిల్లీ వెళ్లి పలు కమిషన్లకు ఫిర్యాదులు చేసి, జ్యోతితో పాటు- లగచర్ల గిరిజనులకు, పేద రైతన్నలకు జరుగుతున్న అన్యాయాన్ని ఢిల్లీ వేదికగా ఎండగట్టారు. దీని ఫలితంగా, ప్రభుత్వం భూసేకరణను వెనక్కి తీసుకుందని వారు తెలిపారు. కేసుల కారణంగా జైలుపాలైన లగచర్ల సోదర సోదరీమణులందరికీ కేటీఆర్ అన్నగా అండగా నిలబడి, న్యాయ సహాయం అందించారని, అందరినీ జైలు నుంచి విడిపించారని వారు తెలియజేశారు.

## ప్రైవేట్ డ్రైవర్లనూ వదలని సర్కార్

### బీమా ఎగ్గొట్టారని మండిపడ్డ కెటిఆర్



హైదరాబాద్-ప్రభాత సూర్యుడు

కేవలం 20 నెలల్లోనే అన్ని వర్గాలను వంచించిన దగాకోరు రేవంత్ సర్కార్.. ప్రైవేట్ రంగంలోని డ్రైవర్లను సైతం నట్టేట ముంచిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికల ముందు అసంఘటితరంగ కార్మికులకు, గిగ్ వర్కర్లకు అరచేతిలో వైకుంఠం చూపించిన రేవంత్.. గద్దెనెక్కాక ఉన్న పథకాన్ని కూడా ఊడగొట్టాడు! అని ధ్వజమెత్తారు.మహోదాత్త హృదయంతో, మానవీయ కోణంతో కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన డ్రైవర్లకు రూ. 5 లక్షల ప్రమాద బీమా పథకానికి ఇన్స్యూరెన్స్ ప్రీమియం ఎగ్గొట్టి, కాంగ్రెస్ ప్రభుత్వం బంద్ పెట్టింది.. నిరుపేద డ్రైవర్ల కుటు-ంబాలకు క్షోభను మిగిల్చింది అని కేటీ-ఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. 2024 అక్టోబర్ నుండి పథకాన్ని ఆపేసి.. ప్రమాదవశాత్తు మరణించిన డ్రైవర్ల కుటు-ంబాలను రేవంత్ రోడ్డున పడేశాడు అని కేటీ-ఆర్ పేర్కొన్నారు. రైతు బీమా, నేతన్నకు బీమా, డ్రైవర్లకు బీమా వంటి ఎన్నో పథకాలతో సబ్బండ వర్ణాల ప్రజల భవిష్యత్తుకు కేసీఆర్ ధీమా అందిస్తే.. ఒక్కో పథకానికి మంగళం పాడి పేద కుటు-ంబాల భవిష్యత్తును అగమ్యగోచరంగా మారుస్తోంది ఈ కర్కశ కాంగ్రెస్ ప్రభుత్వం. రూ. 5 లక్షల ప్రమాద బీమా పథకాన్ని తిరిగి ప్రారంభించాలని, పెండింగ్ క్లెయిమ్‌లను వెంటనే సెటిల్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.. లేకుంటే డ్రైవర్ల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి, ఈ అమానవీయ సర్కార్ మెడలు వంచుతామని కేటీఆర్ హెచ్చరించారు.

## అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తికి ఊరట

### నిషేధిత ఉత్తర్వులను వెనక్కి తీసుకున్న సుప్రీం

న్యూఢిల్లీ-ప్రభాత సూర్యుడు

అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తికిఊరట దక్కింది. గంతలో విధించిన నిషేధ ఉత్తర్వులను సుప్రీం వెనక్కు తీసుకుంది. హైకోర్టు జడ్జిపై ఆంక్షల విషయంలో గతంలో వెలువరించిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు ఉపసంహరించుకుంది. అలహాబాద్ హైకోర్టుకు చెందిన ఓ న్యాయమూర్తి రిటైరయ్యేంతవరకూ ఆయనకు క్రిమినల్ కేసులు అప్పగించకూడదని ఆంక్షలు విధిస్తూ ఈనెల 4న వెలువరించిన ఉత్తర్వులను ఉపసంహరించుకుంటున్నట్లు పేర్కొంది. సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ అభ్యర్థన మేరకు న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం దీనిని వెనక్కి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కేసు విషయంలో తీర్పును పునఃపరిశీలించాలని కోరుతూ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ నుంచి తమకు లేఖ అందిందని ధర్మాసనం పేర్కొంది. సంబంధిత న్యాయమూర్తికి ఇబ్బందులు కలిగించడం తమ ఉద్దేశం కాదని.. అయితే కొన్ని విషయాల్లో పరిమితులు దాటినప్పుడు న్యాయవ్యవస్థ గౌరవాన్ని కాపాడటమే కోర్టు పనిచేస్తుందని జస్టిస్ పార్దీవాలా పేర్కొన్నారు. అంతకు ముందు ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకున్నప్పటికీ అలహాబాద్ హైకోర్టు తీర్పు చట్టవిరుద్ధమని ఆందోళన వ్యక్తంచేశారు. న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే ఇటువంటి ఆదేశాలను విస్మరించలేమని స్పష్టం చేశారు. ఒక సివిల్ వివాదంలో క్రిమినల్ చర్యలకు అనుమతినిస్తూ అలహాబాద్ హైకోర్టుకు చెందిన ఓ న్యాయమూర్తి ఇటీవల జారీచేసిన ఆదేశాలకు సంబంధించిన కేసులో రి-టైరయ్యేంత వరకూ ఆయనకు ఎలాంటి క్రిమినల్ కేసులు అప్పగించవద్దని ఈనెల 4న సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు ఆదేశంలోని కొన్ని అంశాలు అమలుకాకుండా నిరోధించేందుకు ఫుల్ కోర్టును సమావేశపరచాలని అలహాబాద్ హైకోర్టుకు చెందిన 13 మంది న్యాయమూర్తులు గురువారం అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఒక లేఖ రాశారు. హైకోర్టులపై పాలనాపరమైన పర్యవేక్షణ అధికారం సుప్రీంకోర్టుకు లేదని, అందుకే ఆగస్టు 4నాటి సుప్రీం ఆదేశాల్లో 24వ, 26వ పేరాల్లోని నిర్దేశాలను అమలుచేయరాదని ఫుల్‌కోర్టు తీర్మానించాలని జడ్జీలు కోరారు. ఈ నేపథ్యంలో 'సుప్రీం' తన ఉత్తర్వులను వెనక్కి తీసుకుంది.

# అలీబాబా 40 దొంగలు

## - కెసిఆర్ కుటుంబానికి ఇది సరిపోతుంది
## - అప్పులు చేసి దోచుకోవడంలో అందవేసిన చేయి
## - కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి




హైదరాబాద్-ప్రభాత సూర్యుడు

తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ అడ్డంగా దోచుకున్నారని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మండిపడ్డారు. ఎంత దొరికితే అంత దోచుకున్నారని విమర్శించారు. అప్పులుల తెచ్చి అప్పుల్లోనూ కమిషన్లు దండుకున్న ఫ్యామిలీ వారిదని మండిపడ్డారు. శుక్రవారం గాంధీభవన్‌లో జగ్గారెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. ఇంకా చెప్పాలంటే అంచనా వేయలేనంతగా రాష్ట్రాన్ని దోచి పడేశారని తెలిపారు. అవినీతి ఎలా చేయాలో అనే యూనివర్సిటీకి కేసీఆర్ ప్రొఫెసర్ అని అభివర్ణించారు. రాష్ట్ర ప్రజల ఖజానా దోచుకోవడంలో కేసీఆర్ ఫ్యామిలీ దిట్ట అని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకొని.. సుద్దపూసలాగా.. నంగనాచి మాటలు మాట్లాడుతున్నారని కేసీఆర్ ఫ్యామిలీపై నిప్పులు చెరిగారు. అలీబాబా నలభై దొంగలు అనే -టైటిల్ కేసీఆర్ ఫ్యామిలీకి కరెక్ట్ సెట్ అవుతుందని స్పష్టం చేశారు. వారు స్థాపించిన పార్టీలోని కొత్త ప్రభాకర్ సుద్దపూసలాగా మాట్లాడుతున్నాడని చెప్పారు. ప్రజలకి ఏమైనా చేద్దామంటే ఖజానాలో మిగుల్చకుండా దోచుకొని పోయారంటూ కేసీఆర్ ఫ్యామిలీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలావుంటే బీఆర్ఎస్ నేత, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిపై జగ్గారెడ్డి మరోసారి నిప్పులు చెరిగారు. నువ్వు నా క్యారెక్టర్ అంచనా వేయలేవంటూ కొత్త ప్రభాకర్ రెడ్డికి సూచించారు. రాష్ట్రంలో ఎవర్ని అడిగినా నా క్యారెక్టర్ గురించి చెబుతారన్నారు. నా క్యారెక్టర్‌కి, ప్రభాకర్ రెడ్డి క్యారెక్టర్‌కి చాలా తేడా ఉంటు-ందని పేర్కొన్నారు. ప్రభాకర్ రెడ్డికి ఉన్నంత ఆస్తి నా వద్ద ఉంటే ప్రజలకి ఎప్పుడో పంచేసే వాడినని తెలిపారు. పంచే గుణం మా అమ్మనాన్న నాకు ఇచ్చిన ఆస్తి అని చెప్పారు. భవిష్యత్తులో నేను రూ. వేల కోట్లు- సంపాదించినా వాటిని ప్రజలకే పంచుతానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. నా ఆస్తి నా పిల్లల కోసం కాదని.. ప్రజల కోసమని తెలిపారు. రూ. 1000 కోట్లు- కొన్ని గంటల్లోనే పంచేస్తానన్నారు. ప్రభాకర్ రెడ్డికి ఎలా పంచాలో కూడా తెలియదని ఆక్షేపించారు. నేను ఎలాంటి వాడినో కేసీఆర్, హరీష్ రావుని అడిగి తెలుసుకోవాలంటూ ప్రభాకర్ రెడ్డికి సూచించారు. కొత్త ప్రభాకర్ రెడ్డి.. నీవు మగాడవయితే నా ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభాకర్ రెడ్డిది నా స్థాయి కాదన్నారు. కొన్ని విషయాల్లో ఎమోషనల్ కావ్వడం నా బలహీనత అని తెలిపారు. ప్రజల సమస్య వింటే వాళ్ళ కంటే ముందు నాకే ఏడుపు వస్తుందన్నారు. నా చుట్టూ పేదలు ఉంటారని.. నా వద్దకు క్యాన్సర్ పేషెంట్లు- సైతం వస్తారని చెప్పారు. నేనేమైనా ప్యాకేజీల లీడర్ నా అంటూ బీఆర్ఎస్ నేతలను ఈ సందర్భంగా జగ్గారెడ్డి సూటిగా ప్రశ్నించారు. నేనేమి బీ ఫారంలు కొనుకొని రాలేదని వ్యంగ్యంగా అన్నారు. దొంగతనాలు మీరు చేసి.. మాపై నిందలు వేస్తారా? అంటూ బీఆర్ఎస్ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ మీలాగా ప్రైవేట్ కంపెనీనా? అని వారిని నిలదీశారు. ఇసుక దందాలలో మీరు సంపాదించింది ఎంత? అంటూ ఆ పార్టీ నేతలను ఆయన ప్రశ్నించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని భూములు, చెరువులు కబ్జా చేసింది బీఆర్ఎస్ నాయకులేనని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

## ఫసల్ బీమా యోజనతో రైతులకు అండ

### ప్రభుత్వ నిర్ణయంతో రైతుల్లో ఆనందం




హైదరాబాద్-ప్రభాత సూర్యుడు

కేంద్రం తీసుకుని వచ్చిన ఫసల్ బీమాలో చేరాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో రైతులకు మేలు జరుతుందని కూడా తెలిపింది. రైతులను ఆదుకునే క్రమంలో పసల్ బీమా యోజనలో చేరడం, రైతల కిస్తీకూడా ప్రభుత్వమే భరిస్తుందిన సిఎం, డిప్యూటి సిఎంలు కూడా వెల్లడించారు. రైతులకు కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం రైతాంగానికి వెన్నుదన్నగా నిలుస్తుంది..ప్రకృతి కరుణించక అనుకోని వైపరీత్యాలతో పంట నష్టపోతూ... ఇక వ్యవసాయం వద్దు అనుకునే రైతన్నకు ప్రధానమంత్రి ఫసల్ భీమ యోజన అండగా నిలుస్తోంది. దేశానికి వెన్నుముక రైతు , రైతు పంటలు పండిస్తేనే ప్రజలకు ఐదు వేళ్ళు నోట్లోకి వేలుతాయి. అలాంటి రైతు తాము పండించిన పంటకు అకాల వర్షాలతోనో అనుకోని వైపరీత్యాలతో పంట నష్టపోతే అ రైతు పరిస్తితి ఏంటి అనుకునే తరుణంలో ఫసల్ బీమాయోజన వారికి ఆసరాగా నిలిచింది. పంట నష్టపోయిన రైతన్నను అమ్మలా అదుకుంటూతుంది. వ్యవసాయం దండుగ అని గతంలో అన్న రైతుకు వ్యవసాయం పండుగా అనేలా ప్రతి రైతు ప్రకృతి వైపరీత్యాలకు బెదరకుండా తమ భూమిని సాగు చేసి వ్యవసాయాన్ని చేసే దైర్యాన్ని ఇస్తుంది.. ఫసల్ బీమా యోజన పథకం. రైతు తాము పండించే పంట పెట్టుబడి ఎకరాకు అందులో రెండు శాతం ఫసల్ బీమా పథకం ప్రీమియం కడితే చాలు వరిపంటకు ఎకరాకు 34 వేల బీమా ఉండగా అందులో రెండు శాతం అంటే 680 రూపాయలు ప్రీమియం కడితే చాలు అలగే మొక్క జొన్న ... వేరుశనిగే పంటలకు రెండు శాతం ఉండగా పసుపు పంటకు మాత్రం 3.5 శాతం ప్రీమియం చెల్లించాల్సి ఉంది.. దీంతో రైతుకు ఎదురయ్యే ఇబ్బందులు తెగుళ్ళు .. వడగళ్ళు.. పిడుగులు.. అకాల వర్షాలతో పంట నష్టపోతే ఆ రైతుకు ఫసల్ బీమా రక్షణగా నిలుస్తుంది.. వీటితో పాటు ఇందులోనే వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం ద్వారా పత్తి పంటతో పాటు మిర్చిపంటకు కూడా రైతు 5 శాతం ప్రీమియం చెల్లిస్తే వాతావరణం అనుకులించ కున్న వేసిన విత్తనం మొలకేత్తకపోయిన రైతుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పంట పెట్టుబడి నష్ట పోకుండా ఫసల్ బీమా పథకం అండగా నిలుస్తుంది. పంటకోత తర్వాత జరిగే నష్టాలకూ బీమా వర్తిస్తుంది. పంటనష్టం జరిగిందని తెలియగానే బీమా మొత్తంలో 25 శాతం మొత్తాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారు. అంతేకాదు క్లెయిమ్ సెటిల్ కోసం పంట నష్టాన్ని అంచనా వేయటానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడతారు. స్మార్ట్ ఫోన్ల ద్వారా పంట కోత సమాచారాన్ని ఫొటోలు తీసి, అప్‌లోడ్ చేస్తారు. గతంలో ఎన్నో పంట బీమా పథకాలు ఉన్న కూడా తాము అకాల వర్షాలతో నష్టపోయే వాళ్ళమని... ఇప్పుడు ఫసల్ బీమాపై వ్యవసాయ అధికారులతో పాటు బ్యాంకు అధికారులు అవగాహన కల్పించడంతో తాము వ్యవసాయం అంటే కష్టం కాదని వ్యవసాయాన్ని ఇష్టంతో చేసుతున్నామని రైతులు తెలుపుతున్నారు.

# యూట్యూబ్‌ను షేక్ చేస్తున్న ‘ఎశ నాగుల కట్ట మీద’ పాట




హైదరాబాద్: నేచురల్ స్టార్ నాని, కీర్తి సురేష్ జంటగా నటిస్తున్న ‘ది ప్యారడైజ్’ చిత్రంలోని ‘ఎశ నాగుల కట్ట మీద’ పాట యూట్యూబ్‌లో దూసుకెళ్తోంది. పాట విడుదలైన కొద్ది గంటల్లోనే మిలియన్ల వ్యూస్ సాధించి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తెలంగాణ జానపద నేపథ్యంలోని పాటను కొత్త తరహాలో రీక్రియేట్ చేసి సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ అద్భుతమైన బీట్‌ను అందించారు. జానపద సొబగులకు మాస్ బీట్‌ను జోడించడంతో పాటకు ప్రత్యేకమైన ఊపు వచ్చింది. పాట విడుదలైన వెంటనే అభిమానులు, సంగీత ప్రియుల నుంచి మంచి స్పందన వస్తోంది. పాటలో నాని, కీర్తి సురేష్ వేసిన మాస్ స్టెప్పులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలంగాణ ఫోక్ ఫ్లేవర్‌కు తగ్గట్టుగా రూపొందించిన పాటలో ఇద్దరి డ్యాన్స్ అభిమానులను ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా నాని మాస్ లుక్, స్టెప్పులు పాటకు మరింత క్రేజ్ తీసుకొచ్చాయి. ‘ఎశ నాగుల కట్ట మీద’ పాటకు కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించారు. జంగిరెడ్డి, ప్రభా బంగారిగల్ల తమ గాత్రంతో పాటకు మరింత జోష్ తీసుకొచ్చారు. తెలంగాణ జానపద శైలిని ఆధునిక సంగీతంతో మేళవించిన ఈ పాట ప్రస్తుతం యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో కొనసాగుతోంది. పాట విడుదలైన గంటల్లోనే మిలియన్ల వ్యూస్ సాధించడం ‘ది ప్యారడైజ్’పై ఉన్న అంచనాలను మరోసారి చాటిచెబుతోంది. పాటకు వస్తున్న స్పందనతో చిత్రబృందం కూడా ఆనందం వ్యక్తం చేస్తోంది. సోషల్ మీడియాలో పాటకు సంబంధించిన వీడియోలు, రీల్స్ వైరల్ అవుతున్నాయి. తెలంగాణ ఫోక్ టచ్, అనిరుధ్ మ్యూజిక్, నాని--కీర్తి సురేష్ మాస్ డ్యాన్స్ కలిసి ‘ఎశ నాగుల కట్ట మీద’ పాటను మ్యూజిక్ లవర్స్‌లో హాట్ టాపిక్‌గా మార్చాయి.







## తిరుమలలో సెప్టెంబర్ 4న గోకులాష్టమి ఆస్థానం.. 5న ఉట్లోత్సవం

తిరుమల - ప్రభాత సూర్యుడు :

ద్వాపరయుగ పురుషుడైన శ్రీకృష్ణుడిని స్మరించుకుంటూ తిరుమల శ్రీవారి ఆలయంలో సెప్టెంబర్ 4న గోకులాష్టమి ఆస్థానం, సెప్టెంబర్ 5న ఉట్లోత్సవాన్ని టీటీడీ వైభవంగా నిర్వహించనుంది. సెప్టెంబర్ 4న శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి ముఖ మండపంలో రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు గోకులాష్టమి ఆస్థానం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా బంగారు సర్వభూపాల వాహనంపై శ్రీకృష్ణస్వామివారిని వేంచేపు చేసి నివేదనలు సమర్పిస్తారు. శ్రీ ఉగ్రశ్రీనివాసమూర్తి, శ్రీదేవి-భూదేవి అమ్మవార్లు, శ్రీకృష్ణస్వామివారికి ఏకాంత తిరుమంజనం నిర్వహించిన అనంతరం ద్వాదశారాధనం చేపడతారు. సెప్టెంబర్ 5న సాయంత్రం 4 గంటలకు తిరుమలలో ఉట్లోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శ్రీ మలయప్పస్వామివారు బంగారు తిరుచ్చిపై, శ్రీకృష్ణస్వామివారు మరో తిరుచ్చిపై తిరుమాడ వీధుల్లో విహరిస్తారు. యువకులు ఉత్సాహంగా పాల్గొని ఉట్లను కొడుతూ భక్తులకు ఆనందాన్ని పంచనున్నారు. ఉట్లోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 5న శ్రీవారి ఆలయంలో నిర్వహించే ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది. అదేవిధంగా సెప్టెంబర్ 4న గోగర్భం డ్యామ్ సమీపంలోని ఉద్యానవనంలో టీటీడీ ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో కాళీయమర్ధనుడైన శ్రీకృష్ణస్వామివారికి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పంచాభిషేకాలు నిర్వహిస్తారు. అనంతరం అక్కడ ఉట్లోత్సవాన్ని నిర్వహించనున్నారు.



## నేపాల్ వరద బాధితులకు అండగా రియల్ హీరో సోనూ సూద్



రియల్ హీరో, బాలీవుడ్ నటుడు సోనూ సూద్ నేపాల్‌ను ముంచెత్తిన భారీ వరద బాధితులకు అండగా నిలిచారు. నేపాల్‌లో క్షేత్రస్థాయికి చేరుకుని సహాయక చర్యల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. నేపాల్-టిబెట్ సరిహద్దుల్లో సంభవించిన విపత్తు వల్ల సంభవించిన వరదల్లో తీవ్రంగా దెబ్బతిన్న లిలి‘త్రిశూలీ బజార్’లిలి, లిలి‘నువాకోట్’లిలి ప్రాంతాల్లో సోనూ సూద్ తన ‘సోనూ సూద్ ఛారిటీ ఫౌండేషన్’ బృందంతో కలిసి పర్యటించారు. బాధితులను స్వయంగా కలిసి వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. భారత్ నుండి టన్నుల కొద్దీ ఆహార పదార్థాలు, దుప్పట్లు, అత్యవసర వైద్య సామగ్రిని నేపాల్‌కి తీసుకెళ్లిన సోనూ సూద్, వాటిని బాధితులకు అందజేశారు. సహాయం కేవలం ఇప్పటితో ఆగదని, రాబోయే నెలల్లో కూడా బాధితులు మళ్లీ కోలుకునేంత వరకు తన ఫౌండేషన్ ద్వారా సహాయం అందిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. త్రిశూలీ నదికి వచ్చిన బురద, రాళ్ల వరద ధాటికి ఊరికి ఊరే కొట్టుకుపోయినా, సజీవంగా నిలిచి వార్తల్లో నిలిచిన ఒక పచ్చటి ఇంటిని (‘మిరాకిల్ హౌజ్’) సోనూ సూద్ సందర్శించారు. ఆ సమయంలో ఆ ఇంటి పైకప్పుపైకి ఎక్కి ప్రాణాలు కాపాడుకున్న కుటుంబసభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. విపత్తు సమయంలో పొరుగు దేశమైన నేపాల్‌ను ఆదుకునేందుకు భారత ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ వెంటనే స్పందించి వేగంగా పంపిన సహాయక చర్యలను సోనూ సూద్ మనస్ఫూర్తిగా అభినందించారు. **“వరదల ధాటికి నేపాల్‌లో ఇళ్లు, కుటుంబాలు, చివరకు పిల్లలు తమ బాల్యాన్ని కూడా కోల్పోయిన పరిస్థితి చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది. నేపాల్ ఒంటరి కాదు.. మేము వారికి అండగా ఉంటాం. మళ్లీ వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపేంత వరకు మా పోరాటం ఆగదు.’** --సోనూ సూద్

Printed by RATNA GRAPHICS, At H.No. 2-3-703/7, Tirumala Nagar Colony, Police Lane, Amberpet, Hyderabad-500 013 Telangana.
Published by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS, Printed at HYDERABAD and Pulblished at H.No: 7-83/2, HANUMAN NAGAR, KUNTLOOR, ABDULLAPUR MET MANDAL,Hayath Nagar, Pin: 501505, Rangareddy District/Hyderabad City,Telangana.
Editor : CHERUKU UPENDAR, E-mail: prabhathasuryudueditor@gmail.com PRGI Reg No : TGTEL/25/A0555